క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. కదిరి డివిజన్ నుంచి 50 మంది సెలెక్షన్స్‌లో పాల్గొనగా అందులో ప్రతిభ కనబరచిన నక్షత్ర, మాధవి, నందిని, బ్యూలా, ఝాన్సీ, సభాఖానం, చాందినీ, షబ్రిన్, అఫ్రిన్, ప్రణీత, సమీర, సాయి, రిషిత, స్వప్న, అర్చన, గౌతయి, షర్మిలను జిల్లా జట్టుకు తీసుకున్నారు. స్టాండ్‌బై గర్ల్స్‌గా రేష్మ, సాయిప్రియ, యువరాణి, సాహితిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి మహేష్, పీడీ నరసింహాచారి, యశోదాదేవి, సుజాత పాల్గొన్నారు.

సర్వేపై అధికారులకు శిక్షణ

అమడగూరు: సచివాలయ సిబ్బందికి నైపుణ్య అభివృద్ధి సర్వేపై మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. వీరికి శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శి మమత, వెల్ఫేర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రెడ్డి సర్వేపై అవగాహన కల్పించారు. నవంబర్ మూడో తేదీన సర్వే ప్రారంభించి నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో రిమాండ్

తలుపుల: మండలకేంద్రంలోని బురుజుపల్లికి చెందిన సి.క్రిష్టారెడ్డిపై చీటింగ్ కేసు నమోదైంది. రూ.8 లక్షల డబ్బు తీసుకుని, తిరిగి చెల్లించకుండా మోసం చేశాడని తనకల్లు మండలానికి చెందిన ఓ మహిళా టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ నరసింహుడు మంగళవారం తెలిపారు.

టేబుల్ టెన్నిస్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కదిరి అర్బన్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)లో జరిగిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జనార్ధన్, హర్షవర్ధన్‌రాజు, నాగూర్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, పీడీ నరసింహాచారి, అధ్యాపకులు హైదర్ అలి మంగళవారం విజేతలను అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ, తదితరులు

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శైలజ, పీడీ నాగేంద్ర, హిందీ పండిట్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం వీరిని అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు అశోక్‌కుమార్, మధుసూదన్, నెట్‌బాల్ పోటీలకు సాయికుమార్, బాస్కెట్‌బాల్ పోటీలకు శశిధర్ ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌బాబు, లలితమ్మలు పాల్గొన్నారు.

అన్నిదానాల్లోకి రక్తదానం మిన్న



రక్తదానం చేస్తున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: అన్నిదానాల్లోకి రక్తదానం మిన్న అని కదిరి పట్టణ సీఐ డి.వి.నారాయణరెడ్డి తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేస్తే మంచిదని పేర్కొన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు, విద్యార్థులు దాదాపు 110 మంది రక్తదానం చేశారు.

క్రీడా మైదానం.. కళావిహీనం

- ఎక్కడ చూసినా చెత్తా చెదారమే...
- విరిగిపోయిన వ్యాయామ పరికరాలు
- గుంతలమయంగా మారిన వాకింగ్ ట్రాక్
- పెరిగిపోయిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు



చెత్తతో దర్శనమిస్తున్న క్రీడా మైదానం ముఖ ద్వారం

ధర్మవరం అర్బన్: ఒకప్పుడు క్రీడల నిర్వహణతో పాటు వ్యాయామం, రన్నింగ్‌కు వేదికగా నిలిచిన మైదానం నేడు నిర్వహణ లేక కళ తప్పింది. ఎందరో క్రీడాకారులు ఇక్కడ హాకీ సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎదిగిన చరిత్ర ఉంది. ధర్మవరం పట్టణ వాసుల కోసం గతంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించారు. వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ వంటివి ఎన్నో అందుబాటులోకి తెచ్చారు. ఆటల కోసం, వ్యాయామం కోసం వచ్చే వారితో మైదానం రోజూ కిటకిటలాడుతుండేది. క్రీడాకారుల కోసం మరుగుదొడ్లు కూడా నిర్మించారు. ఎంతో సౌలభ్యంగా ఉన్న మైదానం ఇటీవల అస్తవ్యస్తంగా మారిపోయింది. క్రీడా పోటీలు ఉన్నపుడు మాత్రమే ఉపయోగించుకుంటూ మిగిలిన సమయంలో పట్టించుకోవడం లేదు.

చెత్తతో స్వాగతం

క్రీడా మైదానం ప్రధాన గేట్ వద్దనే పెద్ద చెత్తదిబ్బ దర్శనమిస్తోంది. లోనికి ప్రవేశించగానే మరో చెత్త చెదారం స్వాగతం పలుకుతుంది. కాస్త ముందుకు వెళితే మరిన్ని చెత్త దిబ్బలు కనిపిస్తాయి. ప్రధాన గేటు సమీపంలోనే మూత్రవిసర్జన చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మైదానం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి.

- మైదానంలోని వాకింగ్ ట్రాక్ మొత్తం గుంతలు పడిపోయింది. వాకింగ్ చేసే వృద్ధులు, నడి వయస్కులు, యువకులకు ఈ గుంతలతో పెద్ద ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున వాకింగ్‌కు వచ్చే వారు ఈ గుంతల్లో పడి గాయపడిన సంఘటనలూ ఉన్నాయి.
- ప్రజలు, మహిళలు వ్యాయామాలు చేసే ఓపెన్ జిమ్‌లోని పలు పరికరాలు విరిగిపోయాయి. వాటికి మరమ్మతులు కూడా చేసేవారు లేరు.

పరిశుభ్రంగా ఉంచాలి



క్రీడా మైదానంలోకి ప్రతి ఒక్కరూ వచ్చి వాకింగ్, రన్నింగ్, వ్యాయామాలు, క్రీడలు ఇలా అన్ని రకాలుగా ఉపయోగించుకుంటున్నారు. కానీ మైదానంలోకి రాగానే చెత్తాచెదారం ఉండటంతోపాటు దుర్వాసన వెదజల్లుతోంది. ట్రాక్ గుంతలు పడటంతో వాకింగ్ చేసే సమయంలో కిందపడే ప్రమాదముంది. మైదానంలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలి.

– బి.కృష్ణయ్య, రిటైర్డ్ లెక్చరర్, ధర్మవరం

పరికరాలు బాగు చేయించాలి



ఓపెన్ జిమ్‌లో వ్యాయామ పరికరాలు విరిగిపోయాయి. వాటిని సరిచేయించాలి. జిమ్ చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఆహ్లాదం కోసం క్రీడా మైదానానికి వస్తున్నాం. అయితే ఇక్కడ ఆహ్లాదం కన్నా అపరిశుభ్రత ఎక్కువగా కనిపిస్తోంది. క్రీడా మైదానాన్ని శుభ్రం చేసి వ్యాయామ పరికరాలను బాగు చేయించాలి. – శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్, ధర్మవరం



గుంతలమయంగా మారిన వాకింగ్ ట్రాక్



పాడైపోయిన మరుగుదొడ్లు



విరిగిపోయిన వాటిపైనే వ్యాయామం చేస్తున్న వ్యక్తి



చెత్తాచెదారం, పిచ్చిమొక్కల పక్కనే వ్యాయామం చేస్తున్న యువకులు



క్రీడా మైదానంలో హాకీ ఆడుతున్న యువకులు

ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి కృషి



నూతన చైర్మన్ శంకర్‌నారాయణను సన్మానిస్తున్న ఎన్జీఓ సంఘం నేతలు

ధర్మవరం అర్బన్: ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్జీఓ సంఘం తాలూకా కమిటీ నూతన చైర్మన్ శంకర్‌నారాయణ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో మంగళవారం ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా ట్రెజరీ అధ్యక్షుడు ఫరూక్ అహ్మద్, కోశాధికారి అనంతయ్యల ఆధ్వర్యంలో తాలూకా నూతన కమిటీని ఎంపిక చేశారు. తాలూకా చైర్మన్‌గా డి.శంకర్‌నారాయణ, వైస్ చైర్మన్లుగా ఎస్.హరీష్‌రావు, సురేష్‌నాయక్, కన్వీనర్‌గా శ్రీనివాసులు, క్యాషియర్‌గా కృష్ణప్ప, ఈసీ మెంబర్‌గా వెంకటరమణ, విష్ణువర్ధన్‌రెడ్డిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చలపతి, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలకు చెందిన మందల మల్లికార్జున, మందల మీనాక్షి దంపతులు పదిరోజుల వ్యవధిలో ఇద్దరూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల ఆర్థికసాయం అందించారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

అక్రమ మద్యం పట్టివేత

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనగానపల్లి మండలంలోని మద్దెల చెరువులో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఫరూఖాజం, ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన మేరకు గ్రామానికి చెందిన కొడిదల గోపాల్ వద్ద నుంచి కర్ణాటక మద్యం 45 టెట్రా ప్యాకులు, 8 ఆంధ్ర బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ చంద్ర, కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, నాగార్జున పాల్గొన్నారు.

విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్‌కు ఘన సన్మానం



ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కిష్టప్పలను సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి: విద్యాశాఖ కడప ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన శామ్యూల్‌ను కొత్తచెరువు డీఈఓ కార్యాలయం సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆర్జేడీకి ఏడీ–1 నాగరాజు, ఏడీ–2 రామకృష్ణ, ఏడీ–3 లాజర్, ఎంఈఓ–2 జయచంద్ర, ఏపీఓ ప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించి జిల్లాలో పాఠశాలల పరిస్థితులపై ఆర్జేడీ చర్చించారు.

పుట్టపర్తి: విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్, నూతన డీఈఓ కిష్టప్పలను మంగళవారం వైఎస్సార్‌టీఏతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్తచెరువు డీఈఓ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన్ని సన్మానించారు. అలాగే పక్క జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వారిని కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశప్ప, రాజేష్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామమోహన్, రాజగోపాల్, మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడు భూతన్న, ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, సుధాకర్, శివ, సురేష్‌కుమార్, శ్రీనివాసులు ఆర్జేడీ, డీఈఓలను కలిసిన వారిలో ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సాయిగీత, వనజావాణి, ఉమ్మడి జిల్లా సీఆర్ఓ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ దృష్టికి ప్రైవేట్ స్కూల్స్ సమస్యలు

బత్తలపల్లి: జిల్లాకు విచ్చేసిన ఆర్జేడీ శామ్యూల్‌తో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ కిష్టప్పను జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కొత్తచెరువులోని విద్యాశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సింగారెడ్డి, అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల సీఆర్వో కోటిరెడ్డి, రవిచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ మిడతల లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సాయిగీత, ఉప కార్యదర్శి వనజావాణి, కోశాధికారి జయచంద్ర నాయుడు, డీసీఈబీ సభ్యుడు వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు మంజూరు

ఎన్పీకుంట: గ్రామాల్లో నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండకుండా సామాజిక ఇంకుడు గుంతల (సోక్ పిట్) నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. మండలానికి 1,000 ఇంకుడు గుంతలు మంజూరైనట్లు ఎంపీడీఓ ఆంజినప్ప, ఏపీఓ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాల్లో వీధిరోడ్లకు ఇరువైపులా ఇంకుడు గుంతలు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6,000 ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

లీకేజీ సమస్య పరిష్కరించండి

సాక్షి ఎఫెక్ట్..

నల్లచెరువు: బాలేపల్లి దిగువతండాలో పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ రఘునాథగుప్తా పంచాయతీ అధికారులను ఆదేశించారు. 'పైపులైన్ లీకేజీతో నీరు వృథా' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎంపీడీఓ ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ సోనాలమ్మ పంచాయతీ కార్యదర్శి నరసింహులుతో కలిసి బుధవారం తండాలో పర్యటించారు. పైపులైన్ లీకేజీ కాకుండా చూడాలని, మురుగు నీరు రోడ్డుపై పారకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఆదేశించారు. ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆయుర్వేద వైద్యంపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న ఆయుర్వేద డాక్టర్ రత్నచిరంజీవి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కనుముక్కల గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం కనుముక్కల ఆయుర్వేద వైద్య డాక్టర్ రత్న చిరంజీవి మాట్లాడుతూ ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్వతి, ఆసుపత్రి సిబ్బంది నాగమణి, ఇంద్రావతి, యోగా శిక్షకుడు మహేష్, షకీలా, మహిళలు హాజరయ్యారు.

జూదరుల అరెస్ట్

నల్లచెరువు: దామవాండ్లపల్లిలో జూదం ఆడుతున్న ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు. జూదర్ల వద్ద నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

టపాసుల దుకాణాల పరిశీలన

కదిరి అర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను మంగళవారం ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ పరిశీలించారు. దుకాణాల వద్ద నీటి బకెట్లు, ఇసుక, ఫస్ట్ ఎయిడ్స్ కిట్లను తనిఖీ చేశారు. నిబంధన మేరక టపాసుల విక్రయాలు చేయాలని దుకాణాదారులను ఆదేశించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు.

నైపుణ్య గణన సర్వే పక్కాగా చేపట్టాలి



ఎన్పీకుంటలో సూచనలిస్తున్న ఎంపీడీఓ అంజినప్ప

కదిరి అర్బన్/ఎన్పీకుంట/ గాండ్లపెంట/ నల్లచెరువు/ ఓడీచెరువు: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణన సర్వేపై మంగళవారం కదిరి, ఎన్పీకుంట, గాండ్లపెంట, నల్లచెరువు, ఓడీచెరువు మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓలతో పాటు శిక్షణ పొందిన అధికారులు సర్వేపై వివరించారు. ప్రతి ఇంటినీ సందర్శించి 15 నుంచి 59 సంవత్సరాల వయసు గల వారిని గుర్తించి, వారికి ఎటువంటి శిక్షణ ఇస్తే ఉపాధి లభిస్తుందో కూలంకశంగా వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. నైపుణ్య గణన సర్వే సమయంలో ఓటీపీ తెలపడానికి, బయోమెట్రిక్ వేయడానికి ప్రజలు సందేహపడాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు

బత్తలపల్లి: అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఈ నెల 31 నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ఉచిత గ్యాస్ బుక్ చేసుకోండి

ముదిగుబ్బ: ఉచిత గ్యాస్ కోసం బుకింగ్ చేసుకోవాలని సీఎస్‌డీటీ మునిస్వామి తెలిపారు. రేషన్‌కార్డుదారులు ఈ పథకానికి అర్హులన్నారు.

నల్లమాడ: మండలంలో అర్హులైన వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవాలని తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు.

వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీ

నల్లమాడ: మండల కేంద్రంలోని వారపు సంతలో మంగళవారం ఇద్దరు వినియోగదారుల సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. రాగానిపల్లికి చెందిన రఘునాథరెడ్డి, మరొక వ్యక్తి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా వారి జేబుల్లోని సెల్‌ఫోన్లను దుండగులు తస్కరించారు.

సంక్షిప్త వార్తలు

ధన్వంతరి మహర్షి జయంతి

కదిరి టౌన్: పట్టణంలోని కోనేరు సర్కిల్‌లో ఉన్న రామాలయంలో మంగళవారం ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


చౌడేశ్వరిదేవికి పూజలు

తాడిమర్రి: మండల కేంద్రంలోని తూర్పు చెరువు సమీపాన చౌడేశ్వరి అమ్మవారు ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుండలిని శక్తి పాత్ సిద్ధ మహాయోగి చౌడేశ్వరి, రమ్యాదేవి ఆశ్రమంలో జరుగుతున్న నిత్య హోమాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ముందుగా అమ్మవారి ఆలయంలోపూజలు చేశారు.

రబీ పంటలకు బీమా చేయించుకోండి

అమడగూరు: రబీలో సాగు చేసే పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటరమణాచారి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ 480, టమాటకు రూ1,600 చొప్పున డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.630 ప్రకారం డిసెంబర్ నెలాఖరులోపు చెల్లించాలన్నారు.

న్యాయవాది కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి టౌన్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అనంతపురం కోర్టు జూనియర్ న్యాయవాది రుక్సాన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు చేయూతనందించారు. బుక్కపట్నం మండలం సిద్దరాపురం గ్రామానికి చెందిన జూనియర్ న్యాయవాది రుక్సానా ఆర్థిక ఇబ్బందిలతో ఈ నెల 24న ఆత్మహత్య చేసుకుంది. వైఎస్సార్ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో పెనుకొండ బార్ హాలులో ఆమె తల్లిదండ్రులకు రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, శివశర్మ, చంద్రశేఖర్, బాలాజీ, హరీష్, నాగిరెడ్డి, జావిద్, విక్రాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్డీటీ ఏరియా ఫెస్టివల్

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం వద్ద మంగళవారం ఏరియా ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ క్రిష్ణ, ఎస్టీఎల్ కావేరి హాజరయ్యారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సీఓలు ప్రకాష్, రమణ, పర్వీన్, శ్రీరాములు, శిల్ప, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో రక్తదానం

రామగిరి: అన్నిదానాల్లో కంటే రక్తదానమే మిన్న అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రామగిరిలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ జానకిరామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా బంద్ చేస్తున్నామని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

రూపురేఖలు మారనున్న బత్తలపల్లి కూడలి

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలి రూపురేఖలు మారనున్నాయి. కూడలిలో సుమారు 13 సెంట్ల స్థలంలో భవనాలను తొలగించడానికి బాధితుల అకౌంట్లలో నష్టపరిహారం జమ అయ్యింది. ఖాళీ చేయాలంటూ భవనాల యజమానులు, దుకాణాదారులకు అధికారులు సోమవారం నోటీసులు అందజేశారు. అనంతపురం -కదిరి జాతీయ రహదారి బత్తలపల్లి మీదుగా వెళ్తుండడం, తాడిపత్రి నుంచి బెంగళూరు తదితర సుదూర ప్రాంతాలకు బత్తలపల్లి మీదుగా సిమెంటు, గ్రానైట్ తీసుకువెళ్లే వాహనాలతో కూడలి నిత్యం కిక్కిరిసిపోతుంటుంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిని విస్తరించడానికి జాతీయ రహదారుల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసిన విషయం విదితమే.

దేశ శ్రేయస్సు, సమగ్రతపై అవగాహన

రామగిరి: పెద్దకొండాపురంలో దేశ శ్రేయస్సు, సమగ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంస్థ సిబ్బంది పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఈఓ కిష్టప్ప

ప్రశాంతి నిలయం: జిల్లా విద్యా శాఖాధికారి(డీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన కిష్టప్ప మంగళవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఈఓకు కలెక్టర్ సూచించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లి, ఎంసీపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ మండల నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. ఎంసీపల్లిలో మాల ముత్యాలు, గరిమేకలపల్లిలో హరిజన వెంకటరాముడు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందించారు. మొత్తాన్ని జెడ్పీటీసీ గోసె నాగార్జున, సర్పంచులు మీనుగ నాగరాజు, సిద్ధన్న, మ ండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రామ్మోహన్ తదితరులు అందించారు.

పీసీబీ డిజైన్‌పై నైపుణ్యాలు పెంపొందించుకోండి



అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మీప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న సంస్కృతి యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ) డిజైన్‌పై ఈసీఈ విభాగం విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీప్రసన్న కుమార్ తెలిపారు. మంగళవారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు డిజైన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీబీ డిజైన్‌లో సిద్ధాంతాలు చాలా ముఖ్యమన్నారు. ఈగల్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి పీసీబీ లేఅవుట్‌లను రూపొందించడంలో మార్గనిర్దేశం చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ సర్క్యూట్ డిజైన్ ప్రాజెక్టుల్లో మంచి భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.